# చిత్రం

పి.వి.రమణకుమార్

ఉదయం ఎనిమిది గంటలకే తయారైన పెద్ద బజారు పురుగు మందుల కొట్టు పున్నారావుని చూసి విస్తుబోయాను. అప్పటికింకా నానోట్లో బ్రెష్ నానుతూనే వుంది.

"బోర్డు పూర్తయిందా అమర్?" అభ్యర్ధనగానే అడిగాడు.

విసుగ్గా చూశాను. నోట్లో బ్రెష్ వుండటంతో వెంటనే సమాధానం చెప్పలేకపోయాను.

"ఈరోజు ఇస్తానన్నావుగా?" మళ్ళీ పురుగుమందుల పున్నారావే అడిగాడు కాస్త అసహనాన్ని తెచ్చుకుంటూ. అతడు నా కళ్ళకో పెద్ద బొచ్చు కుక్కలా కన్పించాడు. తమని పీడించేవి రెండు రకాల పురుగులన్న విషయం ఏ రైతునడిగినా చెబుతాడు. వీళ్ళిచ్చే పురుగుమందులు పురుగుల్ని చంపవు సరికదా! విసుగు చెందీ, విరక్తి చెందీ, అప్పుల పాలై ఆత్మ హత్యలు చేసుకునే వాళ్ళను హాయిగా చంపేస్తాయి.

"ఈ బోర్డు అర్జెంటని ముందే చెప్పాను కదయ్యా?" మళ్ళీ అదే మాట.

"ఈ రోజు ఇస్తానంటే ఉదయాన్నే వస్తారను కోలేదు. సాయంత్రానికి కచ్చితంగా పూర్తి చేసి వుంచుతాను. వచ్చి తీసుకెళ్ళండి" నోట్లో వున్న పేస్టు మరగ పూసేసి చెప్పాను.

"మళ్ళీ వాయిదా పెట్టొద్దు".

"పెట్టను".

అతను వెంటనే వెళ్ళిపోయాడు. అతని పురుగు మందుల కొట్టుకి కొత్త నేమ్ బోర్డు రాయడానికి వారం రోజుల క్రితం ఒప్పుకుని అడ్వాన్సు కూడా తీసుకున్నాను. ఊళ్ళో ఆర్టిస్టుగా మంచి పేరే సంపాదించుకున్నాను. కమర్షియల్ పెయింట్స్ దగ్గర్నుంచి, మోడ్రన్ ఆర్ట్స్ దాకా చిత్రించగలను. ఒక సాధారణ పెయింటర్‌లో ఓ మోడ్రన్ చిత్రకారుడు దాగి వుండటం అద్భుతమైన విషయమేమీ కాదు. కేవలం డబ్బు కోసం ఆర్టిస్టు ఈ రోజుల్లో కమర్షియల్ కాక తప్పదు. కళాకారుడికి భుక్తి గడిస్తేనే గదా! 'క్లాసిక్' గురించి ఆలోచించేది! కొన్ని సంవత్సరాల నా కృషితో డబ్బు కొద్దిగా సంపాదించుకోగలిగాను. ఇప్పుడంతగా కమర్షియల్ వర్క్ గురించి ఆలోచించడం లేదు. 'ఇక తప్పదు, నువ్వే మా షాప్‌కి బోర్డు రాయాలి' అన్న ఒత్తిడి వస్తే తప్పడం లేదు. ఎందుకంటే ఊళ్ళో వున్న మరో ఇద్దరు ఆర్టిస్టులు నా అంత క్వాలిటీ చూపించేలేరన్న విశ్వాసం జనానికుంది.

ఆ మాటకొస్తే ఎం.ఎఫ్ హుస్సేన్ కూడా ఒకనాడు సినీ బ్యానర్లు చిత్రించినవాడే. ఇప్పుడు ఎనభయ్యవ పడిలో కూడా బాలీవుడ్ అందాల నటి మాధురీ దీక్షిత్ ఒంపు సొంపుల్ని కేన్వాసుపై చిత్రిస్తున్నాడు.

ముఖం కడుక్కోవటం పూర్తి చేసి ఎదురింటి వైపు చూశాను. ఆమె పేరు ముంతాజ్ అట! ఈ మధ్యనే దిగింది ఎదురింట్లో. అప్పుడే తల స్నానం చేసి వచ్చిందేమో! నిడుపాటి కురులను విదిలించుకుంటూ నిర్లక్ష్యంగా తన పని చేసుకుపోతున్నది.

నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఈ బ్రహ్మచారి చిత్రకారుడి గుండె ఈ మధ్య వేగంగా కొట్టుకోవడం ముంతాజ్ మతి పోగొట్టే అందాన్ని చూసినప్పటినుంచే అని కచ్చితంగా చెప్పగలను.

మంచి ఎత్తు, చందన వర్ణంలో వుండే మేని రంగు. ఏ ఒంపు , ఏ సొంపు ఎక్కడ ఎక్కడ ఎదగాలో, ఎక్కడ ఒదగాలో అక్కడ పుష్టిగా ఎదిగి ఒదిగి ఎదుటి వాళ్ళ గుండెల్ని మెలి తిప్పగలవు.

ఇంతా చేసి ఆమె ఓ వెలయాలు అన్న పచ్చి నిజం ఒక్కటే నాకు మింగుడు పడని విషయం. ముంతాజ్‌ది నిజంగా అసమాన సౌందర్యం.

*** *** ***

"హలో బ్రదర్"అని పలకరిస్తూ హుషారుగా వూడి పడ్డాడు ఉదయ్. ఉదయ్ నాకున్న అతి తక్కువ మంది స్నేహితుల్లో ఒకడు. ముఖ్యుడు కూడానూ.

"నాలుగు రోజుల్నుంచి దర్శనాలు లేవు. ఊళ్ళో లేవా?" బ్రెష్‌తో బోర్డు పైన పని చేసుకుపోతూనే అడిగాను.

"యస్ బ్రదర్ ఊరెళ్ళాను".

"ఏమిటీ విశేషం?"

"పెద్ద విశేషమే.. కాస్త నీ చేతితో టీ ఇస్తే 'వహ్ తాజ్ బోలియే..' అంటూ..ఆ విశేషం చెబుతా!" కుర్చీలో రిలాక్సవుతూ అన్నాడు.

చిన్నగా నవ్వి జవాబిచ్చాను. "కిచెన్‌లో ఫ్లాస్కు నిండుగా టీ పోసి వుంచాను. మీ చేత్తోనే నాకూ ఓ కప్పు అందించండి సార్.. కాస్త వీర బిజీగా వున్నాను" డ్రమెటిక్‌గా చెప్పాను. చేతిలోని బ్రెష్ అక్షరాలను రంగులతో అందంగా అద్దుతూనే వుంది.

ఉదయ్ వంట గదికి వెళ్ళి రెండు నిమిషాలలో రెండు కప్పుల టీతో వచ్చాడు. ఇద్దరం కూర్చుని నిశ్శబ్దంగా టీ త్రాగటం పూర్తి చేశాం.

"ఇంక చెప్పు ఏమిటి నాలుగు రోజులు ఏంచేశావు?"

ఉదయ్ తాపీగా చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు.

"టూర్ వెళ్ళాను".

"ఎవరితో?"

ఉదయ్ టూర్ల సంగతి నాకు తెలుసు. అతడు కూడా నాలాగే బ్రహ్మచారి. అలాగని నాలాంటి బ్రహ్మచారి కాదు. అన్ని అనుభవాలనూ పొందుతున్న వీరభోగ బ్రహ్మచారి.

"ఈ సారి సూపర్ ఫిగర్ సెట్ అయ్యింది గురూ...కాస్త రేటు ఎక్కువే అయినా ఎంత కో-ఆపరేషన్ ఇచ్చిందనుకున్నావ్! సరదాగా మద్రాసులో మూడు రాత్రులూ గడిపేసి రాత్రి వచ్చేశా. పేరు షర్మిల. ఒక్క సారి చూస్తే వదిలిపెట్ట బుద్ధి కాదు. అయినా చెవిటి వాని ముందు శంఖం వూదినట్టు నీ దగ్గర ఎన్ని రాసక్రీడల గురించి చెప్పినా, చర్చించినా ఉపయోగం ఏముంటుంది? ఎదురింట్లో ఓ సూపర్ డాల్ అద్దెకు దిగిందన్న విషయం నీకు తెలుసా?" తన సహజ ధోరణిలో అడిగాడు.

"అంటే అప్పుడే నీదాకా వచ్చిందా విషయం?"

"భలే వాడివే. ఏ ఫిగరు ఏ ఏరియా నుంచి ఏ ఏరియాకు ఎప్పుడు అడ్రస్ మార్చిందీ అన్న విషయం ఎప్పుడూ మా మా 'నోట్'లో వుంటుంది. చూడు బ్రదర్! ఏ వయసులో అనుభవించిల్సినవి ఆ వయసులో అనుభవిస్తేనే హేపీ! అలా కుదరదనుకో! ఇంక లైఫ్‌లో హేపీ అన్న పదానికి అర్ధమే వుండదు. మనకా ఇప్పట్లో పెళ్ళి అనే ఈవెంటు జరగడం ఇంపాసిబుల్. అలా అని జరగదని కాదు. కాస్త ఆలస్యం. ఈ ఆలస్యంలోనే మనం అనుభవాలను పోగేసుకోవాలి".

"అవును. అలాగే రోగాలను కూడా పోగేసుకోవాలి" నొక్కి చెప్పాను.

"ఛ! ఛ! ఎదురింట్లో దిగిన ముంతాజ్ అంటే అల్లాటప్పా సరుకనుకున్నావా? ఇరానీ బిర్యానీ లాంటిది. చాలా కాస్ట్ పే చేయాలంట. మనలాంటి వాళ్ళకి అందుబాటులో వుంటుందనుకుంటున్నావా? పిచ్చివాడా ఈ విషయాల్లో నువ్వో

హైస్కూలు స్టూడెంటు లాంటి వాడివి. ఈ బొమ్మల గోలలో పడితే నీకు ఆ బొమ్మల గోలా, ఈ లోకం తెలీవు. దేనికైనా వుండాలి రాత!" అంటూ ఎప్పటిలానే ఊరించే నాలుగు మాటలు చెప్పేసి వెళ్ళిపోయాడు ఉదయ్. నా మనసు మళ్ళీ ఎదురింటి ముంతాజ్ గురించి ఆలోచించడంలో మునిగి పోయింది. 'ముంతాజ్‌ది రెచ్చగొట్టే అందమైన పర్సనాలిటీ' అని అనుకోకుండా వుండలేకపోయాను.

*** *** ***

వారం రోజులు గడిచిపోయాయి. ఎంత వద్దని నిర్ణయించుకున్నా నా మనసును నేను కంట్రోల్ చేసుకోలేక పోతున్నాను. ఓ రాత్రి తీవ్ర ఘర్షణకు లోనై జేబు నిండుగా కరెన్సీ కుక్కుకుని బయలుదేరాను.



ఎదురింట్లో ఇంకా లైటు వెలుగుతూనే వుంది. వీధి లైట్లు ఈ మధ్య కరెంటు కోత వల్ల యథా ప్రకారం నిద్ర పోతున్నాయి. గేటు మీద చేయి వేస్తుంటే నా చేయి చలి జ్వరం వచ్చినట్టుగా వణికింది. అప్పటిదాకా వీరత్వాన్ని ప్రదర్శించిన గుండె ధైర్యం ఒక్కసారిగా పంజరంలోని పక్షిలా ఎగిరి పోయింది గేటు కొద్దిగా చప్పుడైంది.

"ఎవరూ!" అన్న కేక లోపలి నుంచి వచ్చింది. అది ముంతాజ్ గొంతుగా గ్రహించాను. ముందుకు నడవాల్సిన కాళ్ళు గిర్రున వెనక్కు తిరిగాయి. వడి వడిగా నడుచుకుంటూ నా గదిలోకి వచ్చేశాను.

*** *** ***

బాగా పొద్దు పోయింది. ఓ ఆర్టుకి ఫినిషింగ్ టచ్ ఇవ్వటంలో మునిగి పోయిన నాకు టైమ్ తెలియటం లేదు. తాదాత్మ్యతలో లీనమై పని చేసే అలవాటు నాకు వాపం అది. సమయాన్నీ, పరిసరాలనూ మరచిపోవడం.

తలుపు చప్పుడైంది. అప్పటికి ఎంత సేపటి నుంచి ఆ చప్పుడవుతున్నదో! నేను గమనించింది ఇప్పుడే. చేతిలో పని వదిలేసి వెళ్ళి తలుపు తీశాను.

ఓ మెరుపు మొహం మీద పడి కాసేపు ఏమీ కనిపించని భ్రాంతికి లోనయ్యాను ఓ క్షణం. ఓ గాలి తెమ్మెర వేగంగా దూసుకు వచ్చిన అనుభూతి. ఎదురుగా నా స్వప్న సుందరి ముంతాజ్.

శిలా ప్రతిమలా నిలుచుండి పోయిన నా మొహంలోకి చూస్తూ—

"లోపలికి రానివ్వరా?" చనువుగా అడిగింది. ఉలిక్కి పడి తేరుకుని పక్కకు తప్పుకుంటూ దారి చ్చాను. లోపలకు వచ్చి నా గదంతా కలియ తిరుగుతూ నా చిత్రాలను ఆసక్తిగా చూడడంలో మునిగి పోయింది. నాకు నోట మాట రావడం లేదు. ఇదసలు కలో, నిజమో కూడా తేల్చుకో లేని పరిస్థితిలో వుండిపోయాను. ఎదురుగా వున్న

కుర్చీలో కూర్చుంటూ "కూర్చోరే, అలా నిలబడే పోయారే!" అన్నది. ఆమె చొరవకు సిగ్గుపడిపోతూ కూర్చున్నాను.

"మీరు నా బొమ్మ గీయాలి" సమ్మోహనంగా నవ్వుతూ చెప్పింది.

"మీరూ..?"

తెలిసి కూడా తెలీనివాడిలా మొహం పెట్టాను. గలగలా నవ్వింది. ఆ నవ్వు స్వచ్ఛమైన పాల నురగలా పొంగింది. ఆ ఒక్క 'ముద్రా' నిజం కాకుంటే నిజంగా ఈమె అందానికే అందం.

'సరె. నా పేరు ముంతాజ్. ఎదురింట్లోనే వుంటున్నాను. మీరు మంచి ఆర్టిస్టు అని తెలిసింది. ఇంకో ముఖ్యమైన విషయం. ఈ రోజు నా పుట్టిన రోజు. అందుకని.."

"అందుకనీ!"

"నా బొమ్మ.. అంటే నన్ను చూస్తూ మీరు బొమ్మ గీచి ఇవ్వగలరా.. ఖర్చు ఎంతయినా ఫర్వాలేదు" నా కళ్ళలోకి లోతుగా చూస్తూ చెప్పింది. అయోమయంలో పడిపోయాను. ఇతన రకూ ఇల్లాంటి అనుభవం ఎప్పుడూ ఎరుగని నేను ఏం చెప్పాలో వెంటనే నిర్ణయించుకోలేకపోయాను. ఆమె నేరుగా అర్థం చేసుకున్నట్టుంది. వెంటనే తన హ్యాండ్ బ్యాగ్ లోంచి పచ్చ నోట్లు బయటికి తీసి చూపిస్తూ–

"ఎంత తీసుకుంటారో చెప్పండి. ఈ రాత్రే నా బొమ్మ పూర్తి చేయాలి" అభ్యర్థనగా అడిగింది.

'భలేవారే..మీరింత ఫాస్ట్ అయితే ఎలా చెప్పండి? నేను డబ్బు పిచ్చి వున్న వాణ్ణి కాను. మీ బొమ్మ గీస్తాను. కానీ ముందు ఆ డబ్బు యధా ప్రకారం మీ హ్యాండ్ బ్యాగులో దాచుకోండి" ఫ్రీగా మూవ్ అవుతూ చెప్పాను. ఆమె లేచి నిలబడి–

"ఇలా కాదు. నా నగ్న చిత్రం.." ముఖంలో ఎలాంటి భావమూ లేకుండా చెప్పింది. షాక్ తిన్న వాడిలా వుండిపోయాను. 'అసలేమిటి ఈమె ఉద్దేశం? అర్ధ రాత్రి ఒంటరిగా వున్న నా గదిలోకి తుపానులా దూసుకు రావడమే కాకుండా, పుట్టిన రోజు అని చెప్పి తన నగ్న చిత్తరువు గీయమం టుందేం?' అర్థం కాని పజిల్‌లా ముంతాజ్.

'బొమ్మ గీయటంలో కష్టనష్టాలు ఎలా వున్నా తాజ్‌మహల్ లాంటి ముంతాజ్ నగ్న సౌంద ర్యాన్ని తనివి తీరా చూడొచ్చు. అనుకోని ఈ అవకాశాన్ని వదులుకోకూడదు. పైగా పుట్టిన రోజంటూ ఓ సెంటిమెంటు పాస్ చేసింది. బర్త్‌డే సూట్‌లో బొమ్మ గీయాలని కోరింది. అవసరం ఆమెది. అవకాశం నాది. వదులుకోవడం మూర్ఖత్వం' అనుకుని ఆమె బొమ్మ గీయాలని దృఢంగా నిశ్చయించుకుని కొద్ది నిమిషాల వ్యవధి లోనే కాన్వాసు సిద్ధం చేశాను. ముంతాజ్ నగ్నంగా నిలబడి వుంది నా ఎదురుగా. కుంచె పట్టుకున్న నా చేయ్యే నిగ్రహం కోల్పోతున్నట్టు వణుకుతోంది ఆమె అందానికి. ఇక నా మనసు స్వాధీనంలో ఎక్కడుంటుంది? 'అయినా మన టాలెంట్‌ని ప్రత్యక్షంగా చూపిస్తే కదా!ఆమెని ఏదైనా కోరే అర్హత వుండేది?' అని అనుకుని చిత్రం గీయ డానికి సిద్ధమయ్యాను. ఆమె సౌందర్యం మతి పోగొడుతున్నా ఎలాగో దిటవు పర్చుకుని దీక్షగా పనిలో నిమగ్నమయ్యాను.

ఆమె ఓపిక చాలా గొప్పది. కొన్ని గంటలపాటు అలానే నిశ్చలంగా నిల్చుండి పోయింది నాకు సహకరిస్తూ. నాలోని కళాకారునికి అది ఓ గొప్ప సవాలు. అయినా సవాలును ధైర్యంగా స్వీకరించి నేను ఈ పని చేయగలను, ఆమె చిత్రాన్ని అద్భు తంగా గీయగలను, అని నన్ను నేను హిప్నటైజ్ చేసుకుని నా శక్తినంతా కలగలిపి ఎట్టకేలకు చిత్రం పూర్తి చేశాను.

చాలా అద్భుతంగా వచ్చింది. నాకే ఆశ్చర్యమే సింది. అచ్చం ముంతాజ్ కళ్ళముందు నిల్చున్నట్టే వుంది. ఇంతలో ఆమె చీర కట్టుకుని వచ్చింది. ఆమెకు వేడి వేడి గా కాఫీ కలిపి ఇచ్చాను. అది త్రాగుతూ, ఆ చిత్రాన్ని చూస్తూ నా కళా సృజనను పొగుడుతూ ఏదేదో మాట్లాడేస్తోంది. నా మనసులో ఇంకా ఆమె నగ్నంగా నా ఎదుట నిల్చున్నట్టే వుంది. కాఫీ తాగడం పూర్తి చేసి చాలా సేపయింది. ఆమె దివ్య మంగళ విగ్రహాన్ని చూసిన ఇది మంచి నేను, అచ్చం తనలానే వున్న తన నగ్న చిత్తరువును చూసిన ఆశ్చర్యంలోంచి ఆమే తేరుకోలేదు.

కాసేపటికి ఆమే మౌనాన్ని ఛేదిస్తూ "నిజంగా మీరు గొప్ప చిత్రకారులు. గొప్ప అనడం మిమ్మల్ని అవమానించినట్టుంటుందేమో! ఇంకా దానికన్నా మంచి పదం వుంటే అదే అనుకోండి. అయినా మీరు గీసిన చిత్రానికి డబ్బిచ్చి వెలకట్టే సంస్కారం, తాహతు నాకు లేవు. అయినా నా పుట్టిన రోజు నాడు ఇస్తున్నాను కాబట్టి ఈ డబ్బు తీసుకోండి" అంటూ కొన్ని పచ్చనోట్లను ఇవ్వబోయింది.

నేను సున్నితంగా తిరస్కరించాను.

"డబ్బు వద్దా! మరేం కావాలి చెప్పండి" అంది ఆరాధనగా నాకేసి చూస్తూ.

"ఏమడిగినా ఇస్తారా?" "నా పరిధిలో ఇవ్వగలి గింది ఇస్తాను. చెప్పండి".

"మీలాంటి అద్భుత సౌందర్య రాశి నుంచి డబ్బు ఆశిస్తానా! మీ కౌగిలిలో ఒక్క రాత్రి కరిగిపోవాలి. మీ తనువూ, నా తనువూ ఏకమ వ్వాలి. ఇది తీర్చలేని కోరికేమీ కాదు. ఊహు! అదీ మీకిష్టమైతేనే. ఇప్పటిదాకా నేను చూపిన నిగ్రహం, నా సంస్కారం నేను కోరిన 'ఒకే ఒక్క కోరికతో తుడిచిపెట్టుకుపోతాయని నాకు తెలుసు. మీ మన సులో నా స్థానం ఆకాశం నుంచి అధఃపాతానికి చేరుతుందనీ తెలుసు. కానీ మీతో అనుభవం పంచుకోని ఈ జీవితం వృధా అని మీ అందాల్ని ఆసాంతం చూశాక అన్పించింది.." ఇంకా ఏదేదో మాట్లాడాలని వున్నా నోరు పెగలడం లేదు. "నా పట్ల మీ ఆరాధనకు, కోరికకు చలించిపోతున్నాను. నేను నిజంగా ఇష్టపడి ఈ వృత్తిలోకి దిగలేదు. దించబడ్డాను. మనిషి రక్తమాంసాలతో జరుగు తున్న ఈ పాపకూప వ్యాపారానికి మనసులతో పని లేదు. మీ కోరికకు మొదట షాక్ తిన్నాను. తర్వాత మీరూ మగాడే కదా! అనుకుని మన సును సమాధాన పర్చుకున్నాను. అయితే మీ కళా సృజనకు, అద్భుత ప్రతిభకు జోహార్లర్పించుకోగలను కాని నా శరీరాన్ని అర్పించి మీలాంటి విలువైన కళాకారుడిని ఈ లోకానికి లేకుండా చేయడం నాకిష్టం లేదు. నేనంటే పడి చచ్చే ఓ ఆరాధకుడు మరణశయ్య మీద వున్నాడు. అతని ఆఖరి కోర్కె తీర్చడానికే ఈ చిత్రం గీయమని మిమ్మల్ని అడిగాను. అతని రక్తమంతా ఎయిడ్సే. రేపు నేనూ అంతే. దయచేసి మీ కోర్కెను తీర్చలేని ఈ నిస్సహాయురాలిని క్షమించండి" అంటూ చేతులెత్తి నమస్కరించింది. ప్యాక్ చేసి వుంచిన తన నగ్న చిత్రాన్ని తీసుకుని నిష్క్రమించింది. ఆమె మన సున్న వెలయాలు. నా చిత్రానికి వెలకట్టలేనని ఆమె అన్నది. ఆమె వెలయాలైనా ఆమె సంస్కారం మాత్రం వెలకట్టలేనిది.



## గోవిందా విజయ రహస్యం!

ఎవరి అండదండలు లేకుండా హిందీ ఇండస్ట్రీలో కష్టపడి పైకొచ్చిన అతి తక్కువ మంది హీరోల్లో గోవిందా కూడా ఒకడు. అయితే ఈ మధ్య తన విజయ రహస్యాన్ని ఇలా బయట పెట్టాడు గోవిందా. తనతో నటించే హీరోయిన్లని కాకాపట్టి రాత్రీ పగలూ కూడా తిప్పకోవడంతో సినిమాలో సెక్సీ సీన్లని బెరుకు లేకుండా నటించేస్తారట. దాంతో సినిమా బాగా ఆడి తీరుతుందంటున్నాడు.